అసంపూర్తి పనులు..
అన్నదాతకు అవస్థలు



వెంకటాపురం శివారులో అసంపూర్తిగా వదిలేసిన పిల్ల కాల్వ పనులు

- పంటపొలాల్లో తవ్విన పిల్ల కాల్వలు
- అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్
- పొలాలకు వెళ్లలేని పరిస్థితి
- పెండింగ్ పనులు పూర్తి చేయాలని రైతుల వేడుకోలు

శాంతినగర్: కాల్వల ద్వారా నీళ్లు వస్తే పంటలు పండించుకుందామని అన్నదాతలు ఆశించారు. కాల్వలు తవ్వితే లక్షల విలువ చేసే భూములు కోల్పోతామని తెలిసినా, సాగు నీటి అవసరాల కోసం రైతులు త్యాగం చేశారు. కాల్వల వెంట బాటలు వదిలితే పొలాలకు బాగుంటుందని, పండిన పంటలు మార్కెట్‌కు తరలించేందుకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని భావించారు. అందుకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులున్నాయి. పొలాలకు నీళ్లు రాకపోగా ఉన్న బాటలను తవ్వడం, మధ్యలో ఉన్న పొలాల్లో కాల్వలు తవ్వకుండా వదిలేయడంతో వారి ఆశలు నిరాశలయ్యాయి. పంట పొలాలకు ఎడ్లబండ్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నెట్టెంపాడు ప్రాజెక్ట్ 99, 100 ప్యాకేజీల కింద అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి మండలాల్లో పెద్ద కాల్వలతో పాటు పిల్ల కాల్వలను తవ్వేందుకు రైతుల నుంచి విలువైన భూములు సేకరించారు. పదేళ్ల క్రితం భూములు స్వాధీనం చేసుకున్నప్పటికి నేటి వరకు పనులు పూర్తిగాక నీరు రాకపోవడంతో అన్నదాతల ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న కాల్వల పనులు పూర్తిచేయించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.



పొలానికి వెళ్లడానికి దారిలేక విత్తనాలు వేయకుండా వదిలేసిన రైతు

అసంపూర్తిగా 99, 100 ప్యాకేజీ పనులు..

నెట్టెంపాడు ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న 99, 100 కాల్వల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో పొలాలకు నీరు రాకపోగా దారులు మూసుకుపోయాయి. లక్షల విలువ చేసే భూములను వేల రూపాయలకు కోల్పోయినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎకరం ధర రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విలువ ఉందని, అప్పట్లో కేవలం రూ.90 వేలకు ఎకరం ప్రభుత్వానికి అప్పగించామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు పోయినా కాల్వల పనులు పూర్తిగాక నీరు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టు కట్టలేదు..



మా పొలానికి వెళ్లడానికి పాతబాట ఉండేది. కాల్వ తవ్వడంతో బాట పూడిపోయింది. కాల్వ తవ్వే సమయంలో పని చేసేవారిని అడిగాం. మా పొలానికి బాట ఎలా వెళ్లేదని ప్రశ్నించగా, కల్వర్టు కడతామని చెప్పారు. ఇప్పటికి పనులు మొదలు పెట్టలేదు. వెంటనే కల్వర్టు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

– సుంకన్న, రైతు, కిష్టాపురం

డబ్బులు వేయలేదు..

కాల్వ తవ్వకాలకు పొలం కావాలని అధికారులు చెప్పారు. అందరి పొలాలు తీసుకుంటే నేను అడ్డుచెప్పను. మాకు మాత్రం వెంటనే నీళ్లు రావాలని అప్పట్లో అధికారులను కోరడం జరిగింది. చుట్టుపక్కల రైతులందరికి కాల్వలో పోయిన పొలానికి డబ్బులు ఇచ్చారు. నాకు మాత్రం ఇవ్వలేదు.

– శీలన్న, రైతు, వెంకటాపురం

రెండెకరాల పొలం ఇచ్చినా..



మాకు ఉండే రెండెకరాల్లో 1.30 ఎకరాల భూమి నెట్టెంపాడు కాల్వల తవ్వకాల్లో పోయింది. మిగిలిన భూమి మూల ముక్కలు ఉండటంతో సాగుకు పనికిరాకుండా పోయింది. అప్పట్లో ఎకరం రూ.90 వేలకు ప్రభుత్వానికి అప్పజెప్పాం. నాపొలం పోయినా తోటి రైతులకైనా నీళ్లు అందుతున్నాయా అంటే అదీ లేదు. తోటి రైతులకైనా నీళ్లు వచ్చేలా చూడండి.

– రమేష్, రైతు, కిష్టాపురం

ఎన్‌ఐఎల్‌పీపై అవగాహన కలిగి ఉండాలి

అయిజ: న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వయోజన విద్య ప్రాజెక్ట్ ఆఫీసర్ అనిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నవభారత్ సాక్షరత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంలోని ప్రజలందరిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసి కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకంలో భాగంగా 15 ఏళ్లు పైబడిన వారందరిని అక్షరాస్యులుగా మార్చాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని, డిజిటల్ పరిజ్ఞానం నేర్పించాలని, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కనెక్టింగ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా సాక్షరులైన వయోజనులకు ఓపెన్ స్కూల్ ద్వారా పైచదువులు చదువుకునే అవకాశం ఉందన్నారు. వృత్తి విద్య కోర్సుల ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ అనిత

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత

గద్వాలన్యూటౌన్: కెనరా బ్యాంక్ ఆఫీసర్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ యూనిట్ వారు విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతూ తల్లిదండ్రులు లేని బాలికలకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడారు. కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రక్తదాన శిబిరాల నిర్వాహణ, టాయిలెట్ల నిర్మాణం, తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సభ్యులు కెనరా బ్యాంక్ విద్యా జీవన స్కీంలో భాగంగా వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జహురుద్దీన్, అసోసియేషన్ సభ్యులు రవి, ప్రవీణ్, అభిమన్యు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కెనరా బ్యాంక్ అసోసియేషన్ సభ్యులు

ధరూరులో కురిసిన వర్షం



ధరూరులో కురుస్తున్న వర్షం

ధరూరు: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వాన పడింది. సాయంత్రం 7 గంటల నుంచి 7:30 గంటల వరకు కుండపోతగా వర్షం కురిసింది. ఖరీఫ్ పంట సాగులో భాగంగా వరి పంట సాగు చేసుకునే రైతులకు కరిగెట్లు చేసుకునేందుకు అనుకూలంగా ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విత్తనాలు వేసుకున్న రైతులకు, నారు మడులు సిద్ధం చేసుకున్న వారికి వరినాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఏది ఏమైనా నాలుగైదు రోజులుగా వర్షాలు లేక పంటలు వాడుపట్టిన నేపథ్యంలో కురిసిన వానతో పంటలకు ప్రాణం పోసినట్టైంది.

15న వాల్మీకులంతా హాజరు కావాలి

అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలోని వాల్మీకి ప్రజా ప్రతినిధులకు ఈ నెల 15న సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ, రాష్ట్ర ఐక్య పోరాట కమిటీ అధ్యక్షుడు మద్దిలేటి ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీలు డాక్టర్ మధుసూదన్ బాబు, బీటీ నాయుడు, మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాములు, మాజీ మంత్రి రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, అనంతపురం ఏడీసీసీ జాయింట్ చైర్మన్ లిఖితలు హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వాల్మీకి మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ కౌన్సిలర్లు, సింగిల్‌విండో డైరెక్టర్లు, మాజీ ఉప సర్పంచ్‌లు హాజరువు కావాలని విజ్ఞప్తి చేశారు. నియోజకర్గంలోని వాల్మీకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శాంతినగర్: అలంపూర్ చౌరస్తాలో ఈనెల 15న నిర్వహించే వాల్మీకి ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమానికి అందరు హాజరుకావాలని అలంపూర్ నియోజకవర్గ వాల్మీకి సంఘం ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం శాంతినగర్‌లో వాల్మీకి సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్యాతూర్ మద్దిలేటి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని వాల్మీకి ప్రజాప్రతినిధులకు, మాజీ ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్‌హాల్‌కు తరలిరావాలని కోరారు.



సమావేశానికి హాజరైన వాల్మీకి సంఘం నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గాప్రసాద్‌లు తెలిపారు.

అయిజ: మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 8:30 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ పట్టణం, మండలంలోని బింగుదొడ్డి, ఎక్లాస్‌పురం, దేవబండ, జడిదొడ్డి గ్రామాలకు అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు.

రాజోళి: మండలంలోని పెద్ద తాండ్రపాడులోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

గోరింటాకుతో మహిళల సందడి

రాజోళి: ఆషాడమాసంలో మహిళలు మైదాకు పెట్టుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం ఆషా డమాసం కావడంతో మహిళలు గోరింటాకు పెట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత యువతకు మైదాకు ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ఇళ్లల్లో పెద్దలు పిల్లలకు, యువతులకు మైదాకును పెడుతున్నారు. యువతులు, మహిళలు చేతుల నిండా డిజైన్లతో మైదాకును పెట్టుకుంటున్నారు. మార్కెట్‌లో రెడిమేడ్‌గా ఎన్నో రకాల కోన్, ఇతర మైదాకు సంబంధిత వస్తువులు అందుబాటులో ఉన్నప్పటికీ, చెట్లపైన కోసిన ఆకుకే మహిళలు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి ఆషాడం మొదలు కావడంతో ఇళ్లల్లో మైదాకు సందడి నెలకొంది.



ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లలో 150 లీటర్ల ఆయిల్ చోరీ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పంచలింగాలకు చెందిన సులేమాన్ ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

కేటీదొడ్డి: వానాకాలంలో సాగు చేస్తున్న పంటల వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని ఏఈఓ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుల్తాన్‌పురంలో పంట వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. పొలాలకు వెళ్లి వివరాలు సేకరించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏఏ పంటలు వేశారో యాప్ ద్వారా ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ఎరువుల దుకాణాల్లో ఎరువుల ఎంత ఉన్నాయో పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కాలనీల్లో సమస్యల పరిశీలన

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, మున్సిపల్ కమిషనర్ సత్యబాబు, అధికారులు సమస్యలను పరిశీలించారు. ఆయా కాలనీల్లో ప్రధాన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 16వ వార్డులో డ్రైయినేజీ నిర్మించకపోవడంతో పారిశుద్ధ్యం లోపించిందని ప్రజలు పేర్కొన్నారు. 4, 5వార్డులలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాలని కోరారు.

క్లుప్తంగా

ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలి

- ఎస్పీ శ్రీనివాసరావు



ఎర్రవల్లిచౌరస్తా: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఇటిక్యాల పీఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎస్ పరిసరాలను, సిబ్బంది విధులను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి పీఎస్‌కు రోజుకు ఎన్ని ఫిర్యాదులొస్తున్నా యి, అందులో ఎన్ని కేసులు నమోదవుతున్నా యని అడిగి తెలుసుకున్నారు. పీఎస్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలని ఎస్పీ సూచించారు. బాధితులకు పీఎస్‌కు వస్తే న్యా యం జరుగుతందని నమ్మకం వచ్చేలా ప్రజల కు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జూలై నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



గద్వాల న్యూటౌన్: తెల్లజాతి పశువులు లంపి స్కిన్ (ముద్దచర్మ) వ్యాధి బారిన పడకుండా పశుసంవర్ధకశాఖ చర్యలు చేపట్టింది. ముందస్తుగా గోట్ ఫాక్స్ టీకాను వేస్తున్నారు. శుక్రవారం మండలంలోని గుర్రంగడ్డలో పశువులకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది నివారణ టీకాలు వేశారు. మొత్తం 30 ఆవులు, లేగదూడలు, ఎద్దులకు టీకాలు వేసినట్లు తెలిపారు. గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో హరితహారంలో భాగంగా మొక్కలను ప్రతి ఇంటికీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో భాగంగా 17,600 మొక్కలు మండలానికి వచ్చాయన్నారు. ప్రతి ఇంటికీ ఒక మొక్కను నాటి పెంచే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎల్‌ఎస్‌ఏ రాష్ట్ర కమిటీలో నడిగడ్డ వాసి

రాజోళి: టీఎల్‌ఎస్‌ఏ(తెలంగాణ లీగల్ స్టూడెంట్ అసోషియేషన్) రాష్ట్ర కమిటీలో జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడకు చెందిన ముసిగంటి సందీప్‌కు స్థానం కల్పించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీకి అధ్యక్షులుగా నియమిస్తూ, టీఎల్‌ఎస్‌ఏ వ్యవస్థాకుడు, రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ బాలు నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, యువత, నిరుద్యోగుల సమస్యలపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించడం లేదని, వారి తరఫున గళం విప్పి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. వ్యక్తిగత, రాజకీయ స్వార్థం కోసం కాకుండా ప్రజలకు మేలు చేసే విధంగా, పోరాడుతామన్నారు. సందీప్‌కు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో ఆవిష్కరణలకు ప్రోత్సాహం



గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్-2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో అద్భుతమైన నైపుణ్యం ఉంటుందని, వాటిని వెలికితీసి ప్రాజెక్టులు తయారు చేసి సమర్పించే విధంగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గద్వాల మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులే



అమరవాయిలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో సరిత, నాయకులు

- మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సరిత

మల్దకల్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని మాజీ జెడ్పీచైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇన్‌చార్జి సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమే అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి పిల్లల చదువుపట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 6మంది ఉపాధ్యాయులతో పాటు, వివిధ పాఠశాలల నుంచి బదిలీపై వచ్చిన 7 మంది ఉపాధ్యాయులను వారు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేష్, విజయలక్ష్మి, మల్దకల్, ధరూర్ మాజీ జెడ్పీటీసీలు మురళీధర్‌రెడ్డి, పద్మవెంకటేశ్వరరెడ్డి, సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, తిమ్మయ్య, శ్రీనివాసులు, ఆంజనేయులు, లక్ష్మన్, పద్మమ్మ, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

ఉపాధ్యాయులకు సన్మానం

ధరూరు: మండలంలోని అల్వలపాడు ఎంపీహెచ్‌ఎస్ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయులు షేక్షావలి, గీతామణి, బూతుల్ పతిమాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు ప్రతాప్, వీరన్న గౌడ్, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ తిమ్మారెడ్డిలు శాలువా, పూలమాలలతో సన్మానించారు. బదిలీపై వచ్చిన శివకుమారి, షబానా, శైలజ, శివకుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మమ్మ, పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు హెచ్‌ఎం గోవిందు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రశాంతి, చంద్రకళను జీహెచ్‌ఎం పాగుంటన్న పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు ఉన్నారు.



అల్వలపాడులో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఇటిక్యాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

'ధరణి'తో సమస్యలు



మానవపాడు జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయం



చెట్ల కింద నిరీక్షిస్తున్న స్లాట్‌బుక్ చేసిన వ్యక్తులు

- నెట్‌వర్క్ రాక రైతుల పడిగాపులు
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

మానవపాడు: భూ రికార్డులను డిజిటలైజేషన్ చేసే ధరణి వెబ్‌సైట్‌కు మాత్రం అస్సలు ఓపికలేనట్టుంది. రైతులకు, స్లాట్‌బుక్ చేసిన ప్రజలకు నెట్‌వర్క్ రాక చుక్కలు చూపుతోంది. టెక్నాలజీ పెరుగుతున్నా సమయానికి సమస్యలు పరిష్కారం కావడం లేదు. జాయింట్ సబ్‌రిజిస్టర్ కార్యాయంలో ధరణి సైట్‌తో రైతులకు, రిజిస్టర్ చేసుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. మానవపాడు జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గురువారం 10 స్లాట్‌లు బుక్ చేశారు. పది స్లాట్‌లు బుక్ చేసిన వారు యూఎస్‌ఏ, హైదరాబాద్, ఆదోని, గద్వాల, జల్లాపురం వివిధ గ్రామాల నుంచి వచ్చినవారు. హైదరాబాద్‌లో నివాసించే వ్యక్తులు, వివిధ ప్రాంతాలకు చెందిన వారు స్లాట్‌బుక్ చేసిన వారిలో ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా సమస్య తీరలేదు. దీంతో ఓపిక నశించి రైతులు, ప్రజలు వెనుదిరిగారు. ఉదయం నుంచి ధరణిసైట్ కోసం ఎదురు చూపులు తప్పలేదు. ఉన్నతాధికారులు స్పందించి ధరణి నెట్‌వర్క్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆలస్యం అవుతోంది..



ధరణి సైట్‌తో రైతులు, మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. సైట్ పనిచేయకపోవడంతో చెట్ల కింద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసంతో ఉన్నాం. హైదరాబాద్ నుంచి 200 కిలోమీటర్ల ప్రయాణం చేసి స్లాట్ బుక్ చేసుకోని వచ్చాం. మామ పేరుపై 2.00ఎకరాలు స్లాట్‌బుక్ చేసి రిజిస్ట్రేషన్ కోసం మానవపాడు కార్యాలయానికి వచ్చాం. ఇక్కడ సైట్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మళ్లీ శుక్రవారం రిజిస్ట్రేషన్ చేస్తామంటున్నారు. ధరణి నెట్‌వర్క్‌తో సమస్యలు లేకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరుతున్నాం.

– అంజి, హైదరాబాద్

ధరణి కోసం పడిగాపులు



మానవపాడులో నా కుమారుడు వేదవర్ధన్‌రెడ్డి పేరుపై ఎకరం భూమి రిజిస్ట్రేషన్ కోసం బుధవారం స్లాట్‌బుక్ చేశాను. ఉదయం 10గంటలకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాం. జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ 45 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చాం. నెట్‌వర్క్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్లాట్ బుక్ చేసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసేవిధంగా ఉన్నతాధికారులు స్పందించి సైట్ సమస్యలను పరిష్కరించాలి.

– లక్ష్మారెడ్డి, డైరెక్టర్, కొర్విపాడు

నెట్‌వర్క్ రాకపోవడంతో సమస్యలు..

రాష్ట్ర స్థాయి నుంచి ధరణి సైట్ సమస్యలు ఉన్నాయి. గురువారం స్లాట్‌బుక్ అయిన వారికి శుక్రవారం స్లాట్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తాం. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వాహిదా ఖాతున్, తహసీల్దార్, మానవపాడు